

కేవీస్వ

# మరో మధుమాసం

తలుపు మీద చప్పుడు-టక్-టక్-టక్. ప్రకాశం అని తెలుస్తోంది.

చదువుతున్న నవల అవతల పడేసింది శైలజ. చీర సర్దుకుంది.

"రండి" అంటూ అద్దం ముందుకెళ్ళి ముంగురులు సర్దుకుంది. ప్రకాశం లోపలికి రావటం అద్దంలో కనిపించింది. కర్చీపుతో ముఖాన చెమటలు వొత్తుకున్నాడు. ఇల్లంతాకలయజూశాడు.

"బిందూ లేదా ?..." అంటూ ఈజీ ఛెయిర్‌లో వాలి కూర్చున్నాడు.

"లేరు – ఫ్రెండ్సతో కలిసి మ్యాట్నీ కెళ్ళేరు..."

"ఇంతెండలో..."

"చెప్తే వినదు ... అయిదు మంది వెళ్ళేరు..."

"ఇంతెండలో మాట్నీ..."

ఎనిమిదేళ్ళ బిందూ అంటే శైలజకి ప్రాణం. భర్త పోయేక మరీను. భర్త గుర్తుగా మిగిలిన బిందూ.

ప్రకాశానికీ ఇష్టం బిందూ అంటే. సారధి ఫ్రెండు ప్రకాశం. చివరి క్షణాల దాకా, "ఈ జబ్బు నన్ను తినేస్తుందని తెలుసు ప్రకాశం... తినేస్తోంది...... అయిపోయింది అంతా... శైలజకు ఇంకెవరున్నారు?..." అవే సారధి ఆఖరు మాటలు. అటూ ఇటూ ఇంకె

వరూ లేరు. సారధి ప్రావిడెంట్ ఫండ్ డబ్బులొచ్చేయి. నాలుగున్నర వేలు. సారధి వొద్దన్నా వుద్యోగంలో చేరటం- మంచిదే అయింది. ఆ వుద్యోగమే లేక పోతే ప్రాణానికి ప్రాణమైన బిందూ- ఎంత భారమయేది శైలజకి ?

"గొంతెండిపోయింది..." అన్నాడు ప్రకాశం.

కూజాలోంచి మంచినీళ్ళు అందించింది శైలజ. గాజులు లేని చెయ్యి. వేళ్ళు తగిలేయి. గటగటా తాగేసేడు. ప్రకాశం కొత్తగా వున్నాడివాళ. వాలకం కొత్తగా. ప్రకాశం, భర్తకి ఆప్తమిత్రుడు-ఆఖరి క్షణాలదాకా. ప్రకాశం ఇద్దరు బిడ్డల తండ్రి. అందమైన భార్యకి ఇష్టమైన భర్త. ఉద్యోగం సరదాకే చెయ్యటం. వెనక బోలెడంత ఆస్తి.

"ఏవిటి సంగతులు?" అంటూ మంచం మీద కూచుని దిండు వొళ్ళోవేసుకుంది శైలజ. సంగతులు వున్నా లేకున్నా కబుర్లు చెప్తూనే వుండగలడు ప్రకాశం. మాటకారి. మాట్లాడుతూనే వుండిపోగలడు- గంటల తరబడీ. భర్తపోయిన మూడు నెలలుగా రోజూ వొస్తూ పరామర్శిస్తూనే వున్నాడు. ప్రకాశమే లేకుంటే -విషాదాన్ని భరించటం సాధ్యమయేదా -తనకుగాని-బిందూకి గాని? "అంకుల్- అంకుల్-" అంటూ ఎగ్రాకుతుంది బిందూ ప్రకాశంమీదికి.

"సంగతులు - ఏఁవున్నాయి?..." అన్నాడు ప్రకాశం. "ఆఫీసు శెలవు కదా ... ఎండ మరీ విపరీతంగా వుంది ...ఎలా వున్నావు నువ్వు ఇంట్లో... వొంటరిగా..."అతుకులుగా మాట్లాడుతూ ప్రకాశం.

ఎండే. వేడే. గాలి లేదు. మనసు నిరామయం. శూన్యం. ఆదివారం. ఆఫీసు లేదు. తోచదు. ఇంతేనా జీవితం! రొటీన్ ! రోజూ - వుదయంనుంచి సాయంత్రం - ఆఫీసు. ఫైల్సు. సాయంత్రం - విసుగు. ఆదివారం మరీ విసుగు. జీవితం ఇంతేనా ?...

గడియారం టిక్కు - టిక్కు. విసుగు. ఏదో వుందా- ప్రకాశంలో ? మాటలు లేవు. అంటే మనసు పనిచేస్తూ వుండాలి. టిక్కు- టిక్కు. పొడిదగ్గు దగ్గింది శైలజ. తలెత్తలేదు ప్రకాశం. లేచి నిలబడింది శైలజ. - "కాఫీ చేస్తాను" అంది.

తలెత్తి చూసేడు. దించుకున్నాడు. "వూఁహుఁ- వొద్దులే- అసలే వేడి..."

కూచునేసింది మళ్ళీ. దిండు వొళ్ళో వేసుకుంది. కాళ్ళాడిస్తూ - "వూఁ..." అని కూనిరాగం తీసి ఆపేసింది. సంగీతం ఇష్టమే. పాడటం రాదు. ప్రకాశం గొంతు బాగుంటుంది. కాని పాడటం రాదు - అతనికి.

ఈజీ ఛెయిర్‌లోంచి కిటికీ తలుపు వొకటి తెరిచి మళ్ళీ మూసేశాడు ప్రకాశం. దగ్గరగా వొచ్చేడు. "శైలజా..." అన్నాడు.

దిండు మీద శైలజ చేతులు బిగుసుకున్నాయి. సంసారం చేసిన స్త్రీ. గ్రహించగలదు. అనుకున్నట్టే, అవును. శైలజ భుజంమీద చేతులు. చుట్టుకుంటూ ప్రక్కన కూచున్నాడు. గడియారం ఆగిపోయిందా ? టిక్కు - టిక్కు- వినిపించదు. ఎండ ఏమైంది. ? కిటికీ అవతల వెన్నెలా? ఉన్నట్టుండి ఇదేమిటింత చల్లనైంది? ఏం జరగబోతోంది. "శైలూ ఇవాళ నువ్వెంత అందంగా వున్నావో తెలుసా...వూఁ...నిజం..."

అడ్డు చెప్పలేకపోతోంది. ప్రకాశం గొంతులో మార్దవం. చేతుల్లో - ఎంత చల్లటి విద్యుత్తు ! ఒకటి-రెండు-మూడు -క్షణాలు-నిమిషాలు. ప్రకాశం. మంచి ప్రకాశం. సారధి స్నేహితుడు ప్రకాశం-

"-వొదలండి"

వొదిలించుకుంది -అతి ప్రయత్నం మీద. సంఘర్షణ. తనని తాను జయించటం ! లేచి దూరంగా వెళ్ళి నిలబడింది. జలదరిస్తూ.

తలొంచుకొని క్షమాపణ చెప్పుకుని సిగ్గుపడి-వెళ్ళిపోడేం ప్రకాశం ? మంచి ప్రకాశం.సంస్కారి.సారధిస్నేహితుడు.

"శైలూ..."

"ఏఁవిటి మీరు-మీరు చెయ్యబోయింది?..." కోపం రాదు. అసహ్యం రాదు. తనని తాను జయించిందా? నిజంగానే?

"శైలజా... సారీ...ప్లీజ్...... అపార్థం చేసుకోకు......నేను అలాంటి వాణ్ణి కాను. నా వుద్దేశం ...."

"ఇక మీరేమీ చెప్పక్కర్లేదు..."

"చాలా చెప్పాలి...నువ్వు వినాలి... అలా కూచో...ప్లీజ్..."

కూచుంది అతను చెప్పినట్టే. వింది- అతను చెప్పిందంతా. చెప్పి-వెళ్ళిపోయేడు ప్రకాశం. "ఆలోచించుకో శైలూ- బాగా ఆలోచించు..." అతని చివరి మాటలు ఇంకా ప్రతిధ్వనిస్తూనే వున్నాయి.

ఆలోచిస్తూ అలాగే కూచుని వుండిపోయింది - ప్రకాశం మాటలన్నీ గుర్తొస్తుండగా. మంచివాడు ప్రకాశం. ఏమంటాడూ ?...

"నా వుద్దేశం ... నీకు రక్షణగా వుండాలనే శైలూ... నువ్వంటే నాకు చెప్పలేనంత ఇష్టం...సారధి బ్రతికుండగా నువ్వు స్నేహితుడి భార్యవే... అప్పుడు వేరే వుద్దేశ్యాలు లేవు...ఇప్పుడు నీకు ఇంకెవ్వ రున్నారు?... వొంటరిగా ఎన్ని ఇబ్బందులో నీకు తెలీదా?...... మనసులో మాట దాచుకోకు...నేనంటే యిష్టం లేదా...చెప్పు...పోనీ...యిక మీదైనా యిష్టం రాదా......నాకు పెళ్ళయితేనేం...కళ్యాణికి కూడా నేనేం అన్యాయం చెయ్యను...అర్థం చేసుకో

శైలూ...నువ్వు ఎప్పటికీ ఇలాగే వుండి పోకూడదు... నీ జీవితంలోకి ఇంకో మధుమాసం రావాలి...నేను రప్పిస్తాను. ...నన్ను కాదనకు...సంఘం దృష్టిలో ఇదేదో నేరమౌతుందనుకోకు... ఇలా చాలామంది వున్నారు... నీకు మాత్రం తెలిదా? జీవితాంతం నీకూ బిందూకీ రక్షణగా వుంటాను...ఇంకేం చెప్ప గలను ?...ఆలోచించుకో – శైలూ... బాగా ఆలోచించు ... ..."

ఆలోచిస్తూనే వుంది శైలజ.

*   *   *

ట్రాన్స్‌ఫరొచ్చింది శైలజకు. బెజవాడ బ్రాంచ్ ఆఫీసుకి. ప్రకాశంతో చెప్పింది. శెలవు పెట్టమన్నాడు. పెట్టే సింది. "నేను చెప్పింది-ఏమనుకున్నావ్?" అన్నాడు. ఆలోచిస్తున్నానంది. ఆలోచి స్తూనే వుంది. ఎడతెగని ఆలోచన.

మంచి ప్రకాశం. మెత్తని స్వభావం. తనకూ ఇష్టం. పోనీ-అతను చెప్పినట్టే –వొప్పుకుంటే ? సంఘభయం. నీతి భీతి. కాని – తను అంతగా ఇష్టపడితే సంఘాన్ని ఎందుకు లక్ష్యపెట్టాలి ? శైలజ లక్ష్యపెట్టదు, కాని –

"వొచ్చే ఆదివారంలోగా నా నిర్ణయం చెప్తాను...." అంది ప్రకాశంతో. "ఈలోగా నన్ను బలవంతం చెయ్యకండి ...ఆదివారం సాయంత్రం రండి... సోమవారం నేను బెజవాడలో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలి......నేను వొప్పుకుంటే – ఆదివారం సాయంత్రం ఆరు గంటలికి మా ఇంటి తలుపు తెరిచి వుంటుంది-లేకపోతే-ఎక్కడున్నా ఎప్పు డైనా–మనం మంచి స్నేహితులమే..."

అర్థం చేసుకున్నాడు ప్రకాశం. అలాగేనని వెళ్ళిపోయేడు.

*   *   *

ఏముంది ఇంకా ఆలోచించవలసింది? బిందు. అవును–బిందూ విషయమే.

పైకి చెప్పదు బిందు. సెన్సిటివ్. కాని–లోపల్లోపల? సారధిని మరిచి పోయిందా? ఎప్పటికైనా - మరిచి పోతుందా? పూర్తిగా మరిచిపోవటం– సాధ్యమా బిందూకి?

మధ్యరాత్రిలో ఏదో కలవరిస్తూనే వుంటుంది బిందు. తండ్రి ఫొటోకేసి చూస్తూంటుంది. శైలజ చూస్తే - తల దించుకుంటుంది. దూరంగా వెళ్ళి పోతుంది. పైకి ఏడవదు. లోపలున్నాయా కన్నీళ్ళు?

శైలజ మనసులో త్రాసు. అటు ప్రకాశం. ఇటు బిందు. మొగ్గు ఎటు? లోపలికి చూసుకుంది శైలజ. ప్రకాశం వేపే. మంచి ప్రకాశం – తన బ్రతుకు లోకి మరో మధుమాసం తెస్తానన్న వాడు. తప్పేముంది - అతని మాటలో? అవును - ఎందరు లేరు అలా ? అందు బాటులో మరో మధుమాసం–

శుక్రవారం సాయంత్రం నుంచి ఆదోలా వుంది బిందూ. సరీగా అన్నం తినలా. మాట్లాడదు. ముఖం వడిలింది. మామూలుగా పడుకునే చోటగాక మరో మూలన ముడుచుకుని పడుకుంది.

"ఏంటి బిందూ – చెప్పు – నాతో చెప్పవ్ ?..." బ్రతిమిలాడింది శైలజ. ఏడుస్తుంది బిందు.

బిందు ఏడవటం ! గుండె తరుక్కు పోయింది. ఏమైంది? రాత్రి నిద్రలో "ఛీ–రాణీ... నాన్నపోతే... వూ౹... వొద్దు..." అని కలవరింతలు.

మరుసటి దినం బిందుని పార్కుకి తీసుకెళ్ళింది. ఐస్‌ఫ్రూట్ వొద్దంది. వేరుశనగ పప్పులు కూడా – ముట్టదు. పావుగంట బ్రతిమిలాడితే – వెక్కుతూ చెప్పింది...

"మా...రాణీ లేదూ...అవును-ఆ పాపే – వాళ్ళ నాన్నగారు కూడా పోయారుగా...మళ్ళీ ఇప్పుడు ఇంకో నాన్నట...వాళ్ళమ్మగారు...మళ్ళీ పెళ్ళి చేసుకోలేదుశే – అయినా...వాళ్ళింటికో బాబాయి వొస్తుంటాట్ట ...... వాళ్ళ పక్కింట్లో వుండే సుజీ–భలే గోల చేస్తుంది...ఎగతాళి చేస్తుంది......ఆ బాబాయే రాణీకి ఇంకో నాన్నట ... పాపం-రాణీ ఎలా ఏడ్చిందో...నేను వెళ్ళి ...యాడవద్దన్నాను......అప్పుడేమో సుజీ వొచ్చి–బిందూ నీకూ నాన్న పోయాడుగా...... ఇంకో నాన్న వొస్తాడా? అంది...ఛీ ! ... అందరూ వొకటే గోల... అమ్మా...రేపట్నుంచి స్కూలికి వెళ్ళను నేను..."

బావురుమని తల్లిని వాటేసుకుంది బిందు.పార్కులో చెట్ల ఆకులన్నీ వొక్క సారిగా రాలిపోయినట్లు అనిపించిది శైలజకు

బిందు మనసులో మధుమాసం – శిశిరం కావాలా ?

*   *   *

ఆదివారం సాయంత్రం సరిగ్గా ఆరు గంటలకి వొచ్చిన ప్రకాశానికి ఇంటి తలుపులు తాళంవేసి వుండటం కనిపించింది.

